క్లుప్తంగా

అంతర్వేది స్వామి సన్నిధిలో సినీనటులు



అంతర్వేది ఆలయంలో సినీనటులతో ఏసీ ప్రసాద్

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం సినీనటులు సముద్ర ఖని, జెమిని సురేష్‌లు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి లడ్డు ప్రసాదాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్, సినీనటులకు అందజేశారు.

కళాశాల అభివృద్ధికి రూ.2 లక్షల విరాళం



ఆలమూరు జూనియర్ కళాశాలలో కుళాయిల సముదాయాన్ని ప్రారంభిస్తున్న దాత పాపారావు

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి పారిశ్రామికవేత్త, గౌరవ అధ్యక్షుడు వంటిపల్లి పాపారావు రూ.2 లక్షల విరాళం అందించారు. కళాశాలలో అసంపూర్తిగా ఉన్న ఆర్‌ఓ ప్లాంట్, జిరాక్స్ యంత్రం మరమ్మతులు చేయడంతో పాటు కళాశాల అభివృద్ధికి అన్ని విధాలా చర్యలు తీసుకోవాలని దాత పాపారావు ఆ విరాళాన్ని ప్రిన్సిపాల్ నల్లమిల్లి సురేష్‌రెడ్డికి సోమవారం అందజేశారు. అనంతరం కళాశాలలో తాగునీటి కుళాయిల సముదాయాన్ని ఆయన ప్రారంభించారు. అభివృద్ధి కమిటీ సభ్యులు సంగీత సుభాష్, గుణ్ణం వీర్రాజు, గన్ని విష్ణు, గారపాటి త్రిమూర్తులు, కాలా సాయిబాబు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

పి.గన్నవరం: ముంగండలోని మంత్రవాది ఇందిరా కుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో వేమగిరి పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారన్నారు. కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పీహెచ్‌సీ వైద్యులకు ఉద్యోగుల సంఘీభావం



లూటుకుర్రులో నల్ల రిబ్బన్లతో విధులకు హాజరైన పీహెచ్‌సీ ఉద్యోగులు

మామిడికుదురు: సమస్యల పరిష్కారం కోరుతూ పీహెచ్‌సీ డాక్టర్లు విజయవాడలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు పీహెచ్‌సీ ఉద్యోగులు సోమవారం సంఘీభావం తెలిపారు. దీనిలో భాగంగా సోమవారం నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ప్రభుత్వ డాక్టర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మేము మీ వెంటే ఉంటామంటూ నినాదాలు చేశారు. ఈ నిరసనలో ఎంపీహెచ్‌ఈఓ బీవీవీ ప్రసాద్, ఫార్మసిస్టు జి.దుర్గాప్రసాద్, స్టాఫ్ నర్స్ డి.వెంకటలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ జి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్సీ పేటలకు రోడ్డు సదుపాయం కల్పించాలి



ఈదరాడ సమస్యలపై ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

మామిడికుదురు: ఈదరాడ గ్రామంలోని కమ్మవారిలంక, కొంగులపేటలకు రోడ్డు సదుపాయం కల్పించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నేతలు సోమవారం అమలాపురంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం ఇచ్చారు. 2006లో ఈ పేటలకు గ్రావెల్ రోడ్డు నిర్మించారని చెప్పారు. ప్రతి ఏడాది 20 మంది విద్యార్థులు ఈ ప్రాంతాల నుంచి జెడ్పీహెచ్ స్కూల్‌కు వెళ్తున్నారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులను తీసుకురావాలన్నా ఈ మార్గం ద్వారానే రావాల్సి ఉందన్నారు. 500 మీటర్ల పొడవున్న ఈ అయిదు గ్రామాలకు అనుసంధానమై ఉన్న ఈ రోడ్డును సిమెంట్ కాంక్రీట్ రోడ్డుగా అభివృద్ధి చేయాలని కోరుతూ ఆర్డీవో మాధవికి విజ్ఞాపన పత్రం అందజేశారు. వినతిపత్రం ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు నూటికుర్తి సత్యనారాయణ, ప్రతినిధులు యార్లగడ్డ రవి, నామవరపు చిన సత్యనారాయణ, ముస్కూడి బాలాజీ, చిందురుపు రాధాకృష్ణ తదితరులు ఉన్నారు.

చూసినారా నకిలీ మద్యం

- నకిలీ మద్యంపై ఉద్యమం
- కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో కదం తొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు, మహిళలు
- నకిలీ మద్యంపై గుట్టు తేల్చాలని డిమాండ్
- ఎక్సైజ్ కార్యాలయం వరకు పాదయాత్ర, అధికారులకు వినతిపత్రాల సమర్పణ



కొత్తపేటలో ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం సమర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పి.గన్నవరంలో తహసీల్దార్ శ్రీపల్లవికి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు. పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి

కొత్తపేట: మద్యాన్ని ఏరులై పారిస్తూ, నకిలీ మద్యం సరఫరాతో ప్రజల ప్రాణాలను హరిస్తున్న టీడీపీ నాయకుల వైఖరి, కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ రణభేరి మోగించింది. ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ శ్రేణులు, మహిళలు రోడ్డెక్కారు. నకిలీ మద్యంపై నినదిస్తూ కదం తొక్కారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు, జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పిలుపు మేరకు కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు, మహిళలు మద్యానికి, నకిలీ మద్యానికి వ్యతిరేకంగా ర్యాలీలు, ధర్నాలు నిర్వహించారు. ఎక్సైజ్, రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.

కొత్తపేటలో మద్యం బాటిళ్లతో నిరసన

నియోజకవర్గంలోని కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండల గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు, మహిళలు వందలాదిగా కొత్తపేటలో జిల్లా పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు స్వగృహం వద్దకు తరలివచ్చారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు పాటి శివకుమార్ పాల్గొన్నారు. అక్కడి నుంచి ప్రభుత్వ మద్యం విధానాలకు వ్యతిరేకంగా మద్యం బాటిళ్లు, ప్లకార్డులు చేతపట్టి నినదిస్తూ కమ్మిరెడ్డిపాలెం టర్నింగ్, హైస్కూల్, జూనియర్ కాలేజీ రోడ్డుగుండా ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం వరకూ పాదయాత్రగా చేరుకున్నారు. అక్కడ కొంతసేపు నినాదాలు చేశారు. అనంతరం నకిలీ మద్యం గుట్టు తేల్చేందుకు రాష్ట్ర వ్యాప్తంగా వైన్ షాపులు, బార్లు, పర్మిట్ రూములు, బెల్ట్ షాపుల్లో తనిఖీలు నిర్వహించాలి. దీని వెనుక ఎంత పెద్దవారున్నా అరెస్టు చేయాలి. నకిలీ మద్యంపై తక్షణమే సీబీఐ దర్యాప్తు చేయాలి. నకిలీ మద్యం వల్ల చనిపోయిన వారిని గుర్తించి వారి కుటుంబాలను ఆదుకోవాలి తదితర 6 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయనికి సమర్పించారు.

రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చిన కూటమి

కొత్తపేటలో నియోజకవర్గ పరిశీలకుడు పాటి శివకుమార్, జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో నకిలీ మద్యం తాగి ఎంతో మంది చనిపోయారని, ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చేశారని, బడికి, గుడికి కూడా మినహాయింపు లేకుండా వాటి సమీపంలో బెల్ట్ షాపులు ఏర్పాటుచేసి విచ్చలవిడిగా మద్యం, నకిలీ మద్యం ఏరులై పారిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వెలుగు చూసిన నకిలీ మద్యం రాకెట్ వ్యవహారంలో టీడీపీ నేతలే అన్ని ఆధారాలతో పట్టుబడ్డారని, ఇంకా లోతుగా విచారణ జరిపితే మరిన్ని వాస్తవాలు, టీడీపీ నాయకులు, ఆ పార్టీ సానుభూతిపరుల బాగోతం బట్టబయలవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, కనుమూరి శ్రీనివాసరాజు, తమ్మన శ్రీనివాసరావు, బొక్కా కరుణాకర్, పార్టీ సీనియర్ నాయకుడు కర్రి నాగిరెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి సాకా ప్రసన్నకుమార్, ఎస్ఈసీ సభ్యురాలు సాకా మణికుమారి, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి బొక్కా వెంకటలక్ష్మి, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి కప్పల శ్రీధర్, సర్పంచ్‌లు రెడ్డి చంటి, సాగి బంగార్రాజు, అంబటి సుబ్బలక్ష్మి, కర్రి గోవిందకృష్ణారెడ్డి, నాతి కుమార్‌రాజా, యువజన విభాగం అధ్యక్షుడు జవ్వాది రవిబాబు, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యుడు షేక్ వలీబాబా, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మట్టపర్తి వెంకట్రావు, వివిధ విభాగాల అధ్యక్షులు గూడపాటి ప్రవీణ్‌కుమార్, పార్టీ, అనుబంధ విభాగాల ప్రతినిధులు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల గ్రామ శాఖల అధ్యక్షులు పాల్గొన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: రాష్ట్రంలో విచ్చల విడిగా జరుగుతున్న నకిలీ మద్యం అమ్మకాలను అరికట్టకుండా కూటమి ప్రభుత్వం పేదల ప్రాణాలతో చెలగాటం ఆడుతుందని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ పాలనలో జోరుగా సాగుతున్న నకిలీ మద్యం అమ్మకాలను నిరసిస్తూ గన్నవరపు ఆధ్వర్యంలో పి.గన్నవరంలో సోమవారం పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. పోతవరంలోని పార్టీ కార్యాలయం నుంచి పి.గన్నవరం మూడు రోడ్ల సెంటర్ వరకూ మహిళలతో ర్యాలీ నిర్వహించారు. అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి గన్నవరపు తదితరులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించిన అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ జరిగింది. నకిలీ మద్యాన్ని అరికట్టాలని, ప్రజలను మోసగిస్తున్న చంద్రబాబు డౌన్, డౌన్ అంటూ నినాదాలు చేశారు. కోఆర్డినేటర్ గన్నవరపు మాట్లాడుతూ నకిలీ మద్యం తాగి రాష్ట్రంలో ఇప్పటి వరకూ సుమారు 26 మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు. కోనసీమలోనే నకిలీ మద్యం తయారు చేస్తున్నారని అన్నారు. ప్రజలు పోరాటం చేస్తేనే అక్కడ పోలీసులు కేసులు నమోదు చేశారన్నారు. చంద్రబాబు కూటమి నాయకులకు జేబులు నింపేందుకే పనిచేస్తుందన్నారు. విచ్చలవిడిగా బెల్టు షాపులు కొనసాగుతున్నా, నకిలీ మద్యం అమ్మకాలు జరుగుతున్నా మామూళ్ల మత్తులో మునిగిన ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. జగన్ పాలనలో నకిలీ మద్యం అమ్ముతున్నారని ఆరోపిస్తూ నాడు అంటూ ఊగిపోయిన పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఏం చేస్తున్నారని గన్నవరపు నిలదీశారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో నకిలీ మద్యం ఏరులై పారుతోందని అన్నారు. ఏమీ జరగకపోయినా వైఎస్సార్ సీపీ నాయకులపై లేనిపోని అక్రమ మద్యం కేసులతో వారిని జైళ్లలో పెట్టి వేధిస్తున్న కూటమి ప్రభుత్వం.. ఈరోజు నకిలీ మద్యంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. సీనియర్ నాయకుడు మందపాటి కిరణ్‌కుమార్, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి మాట్లాడారు. తహసీల్దార్ పి.శ్రీపల్లవికి వినతిపత్రం అందించారు. మండల శాఖల అధ్యక్షులు యన్నాబత్తుల ఆనంద్, కొమ్ముల రాము, మేడిశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు నక్కా వెంకటేశ్వరరావు, దొమ్మేటి వెంకట శివరామన్, కుడుపూడి విద్యాసాగర్, దొమ్మేటి సత్యమోహన్, మిండగుదిటి శిరీష్, మద్దుల వరలక్ష్మి, గుత్తుల నాగబాబు, పుచ్చకాయల నర్సింహమూర్తి, సరెళ్ల అప్పారావు, దూనబోయిన రవిచంద్ర, దేశిరాజు సీతారామయ్య, నీతిపూడి విలసిత మంగతాయారు, నెల్లి దుర్గాప్రసాద్, పాముల దేవీప్రకాష్, చేట్ల రామారావు, అధిక సంఖ్యలో మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నకిలీ మద్యంపై తీరును వ్యతిరేకిస్తూ రణభేరి



రాజోలులో ఇన్‌చార్జి గొల్లపల్లి ఆధ్వర్యంలో నకిలీ మద్యానికి వ్యతిరేకంగా..

రాజోలు: నకిలీ మద్యంపై ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకిస్తూ మాజీ మంత్రి, రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి సూర్యారావు ఆధ్వర్యంలో సోమవారం వైఎస్సార్ సీపీ రణభేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజోలు సెంటర్ నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ రాష్ట్రంలో నకిలీ మద్యం కుటీర పరిశ్రమగా విస్తరించారన్నారు. నకిలీ మద్యం తాగిన ఎంతో మంది అమాయకులు ప్రాణాలు కోల్పోవడంతో అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలన్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు నడిపిస్తున్నారని, వైన్‌షాపులు, పర్మిట్ రూమ్‌లు, బార్లు, బెల్ట్‌షాపుల్లో నకిలీ మద్యం గుర్తించేందుకు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. కొన్ని చోట్ల పాఠశాలలు, ఆలయాలు, బహిరంగ ప్రదేశాల్లో వైన్‌షాపులకు అనుమతులు ఇచ్చారన్నారు. అటువంటి వాటి లైసెన్స్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన డిమాండ్ పత్రాన్ని ఎక్సైజ్‌శాఖ అధికారులకు అందజేశారు. నియోజకవర్గ పరిశీలకుడు కర్రి పాపారాయుడు, జెడ్పీటీసీలు మట్టా శైలజ, బళ్ల ప్రసన్నకుమారి, మండపేట నియోజకవర్గ పరిశీలకుడు కటకంశెట్టి ఆదిత్య, మండల పార్టీ అధ్యక్షులు కట్టా శ్రీనివాసరావు, బొలిశెట్టి భగవాన్, కుసుమ చంద్రశేఖర్, రాష్ట్ర నాయకులు కూనపరెడ్డి రాంబాబు, కోటిపల్లి ఎస్తేరురాణి, గుర్రం జాషువా, సూరిశెట్టి బాబి, కొల్లాబత్తుల సతీష్‌బాబు, నేతల నాని, తాడి సహదేవ్, జిల్లెళ్ల ఉదయ్, గుబ్బల సత్యనారాయణ, ఉచ్చుల దాసు, అడబాల జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమంగా కోటి సంతకాల సేకరణ

మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు



మలికిపురంలో కోటి సంతకాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు నిరసనగా వైఎస్సార్ సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ ఉద్యమంగా సాగాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మలికిపురం పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ తలపెట్టిన కోటి సంతకాల సేకరణ వాల్ పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాజీ సీఎం జగన్ ఈ కార్యక్రమం తలపెట్టారని దీనికి ప్రజలు నుంచి విశేష స్పందన లభించిందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ పరిశీలకుడు కర్రి పాపారాయుడు మాట్లాడుతూ పేదలకు మెడికల్ విద్య ఉచితంగా అందాలన్న మంచి లక్ష్యంగా అధికారంలో ఉండగా కేంద్రం సహకారంతో అప్పటి సీఎం జగన్ 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశారని చెప్పారు. మరో రూ.ఆరు వేల కోట్లు ఖర్చు చేస్తే అవి పూర్తయిపోతాయన్నారు. అలా చేయకుండా ప్రైవేటీకరణ చేస్తారా అని అన్నారు. పేదల కోసం ఏదో రకంగా వాటిని అభివృద్ధి చేయడం మానేసి తన అనుయాయులకు కట్టబెట్టాలని చూడడం దారుణమన్నారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రుద్రరాజు చిన్నారాజా, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కటకంశెట్టి ఆదిత్యకుమార్, జెడ్పీటీసీలు బల్ల ప్రసన్నకుమారి, మట్టా శైలజ, మండల పార్టీ శాఖల అధ్యక్షులు కుసుమ చంద్రశేఖర్, బొలిశెట్టి భగవాన్, కట్టా శ్రీనివాస్, రాష్ట్ర, జిల్లా నియోజకవర్గ, అనుబంధ విభాగాల నాయకులు, కె.ఎస్తేరు రాణి, తాడి సహదేవ్, కూనపరెడ్డి రాంబాబు, సూరిశెట్టి బాబి, గుబ్బల వీర వెంకట సత్యనారాయణ, గుబ్బల రమేష్,తదితరులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనులు పూర్తి చేయాలి

ఆలమూరు: గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న నాడు–నేడు పనులను పూర్తి చేయడంతో పాటు జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని పార్టీలకతీతంగా ప్రజా ప్రతినిధులు ధ్వజమెత్తారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎ.రాజు ఆధ్వర్యంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. పలువురు ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను ఏకరవు పెట్టారు. రహదారులు అధ్వానంగా ఉన్నాయని కోఆప్షన్ సభ్యుడు షేక్ షరీఫ్, అర్హులకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని పినపళ్ల సర్పంచ్ సంగిత సుభాష్, ఉచిత బస్సు పథకం అధ్వానంగా తయారైందని మోదుకూరు ఎంపీటీసీ చుండ్రు సునీత, మూతబడిన ఆర్వో ప్లాంట్‌ను పునరుద్ధరించాలని సంధిపూడి సర్పంచ్ తోట భవాని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం 2026–27 బడ్జెట్ మిగులు బడ్జెట్ సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. తహసీల్దార్ కేజే ప్రకాష్ బాబు, ఏడీఏ సీహెచ్‌కేవీ చౌదరి, సీడీపీఓ అధికారి గజలక్ష్మి, ఏఓ బి.మీనా, గృహనిర్మాణ శాఖ జేఈ దర్నాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘తల్లికి వందనం’ అందలేదు



తల్లికి వందనం అందలేదంటూ ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థులు

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రవేశపెట్టిన తల్లికి వందనం పథకం అనేక మంది అర్హులైన లబ్ధిదారులకు అందలేదనడానికి మండలంలోని నవాబుపేటకు చెందిన ఇద్దరు విద్యార్థులు నిదర్శనంగా నిలిచారు. ఆ గ్రామానికి చెందిన సీహెచ్ మాన్విత, వి.శ్రీసిశ్వలిద్దరూ సమీప నర్సిపూడి జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి ఉత్తీర్ణులైన మండపేటలోని ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియెట్ ఫస్టియర్ చదువుతున్నారు. అయితే తల్లికి వందనం పథకం కోసం పలుమార్లు దరఖాస్తు చేసినా ఫలితం లేకపోయిందని ఆ విద్యార్థులు వాపోయారు. ఎప్పుడు గ్రామ సచివాలయానికి వెళ్లినా ప్రాసెసింగ్‌లో ఉందని త్వరలో బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని చెబుతున్నారని ఆ విద్యార్థులు ఆవేదన చెందారు. దీంతో ఆ విద్యార్థులు సోమవారం ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి చేరుకుని ఎంపీడీఓ ఎ.రాజు, ఎంఈఓలు బి.అప్పాజీ, ఎస్.రాజుకు ఫిర్యాదు చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన తమకు తల్లికి వందనం ఇంకా అందకపోవడం దురదృష్టకరమన్నారు. దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడి తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ వారికి హామీ ఇచ్చారు.

రోగికి ఆర్థిక సాయం

సఖినేటిపల్లి: మండలంలోని గొంది గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న కొల్లాబత్తుల జగన్నాథానికి స్థానిక ఎన్నారై యూత్ సభ్యులు రూ.33 వేల ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. ఈ మేరకు పై మొత్తాన్ని ఆయనకు ఇంటి వద్ద రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావుకు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు కేఎస్ఎన్ రాజు, వైస్ ఎంపీపీ కొల్లాబత్తుల నాని, యూత్ పాల్గొన్నారు.

ఎన్జీవో అడ్‌హాక్ కమిటీ కోచైర్మన్‌కు సత్కారం

సఖినేటిపల్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎన్జీవో అడ్‌హాక్ కమిటీ కోచైర్మన్‌గా నియామకం జరిగిన సఖినేటిపల్లి పంచాయతీ కార్యదర్శి తాడి యేసుకు సదరు పంచాయతీలో సోమవారం సత్కారం చేశారు. ఈ మేరకు సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, పరిషత్ కో ఆప్షన్ మెంబర్ బళ్ళ నోబుల్ ప్రభాకర్ ఆయనను సన్మానించారు. అనంతరం యేసు మాట్లాడుతూ, కమిటీ ప్రతినిధులు, సంఘ రాష్ట్ర నాయకులతో కలిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కారాని తగిన కృషి చేయగలమని పేర్కొన్నారు.

రామరాజుకు సత్కారం

సఖినేటిపల్లి: ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అమలాపురం డివిజన్ ఉపాధ్యక్షుడు, మండల ఆర్ఐ వేగిరాజు వెంకట రామరాజుకు సహచర వీఆర్వోలు సోమవారం సత్కారం చేశారు. అమలాపురంలో డివిజన్ స్థాయిలో జరిగిన నూతన కార్యవర్గ ఎంపికలో ఈ మేరకు రామరాజును డివిజన్ ఉపాధ్యక్షుడిగా ఇటీవల ఎన్నుకున్నారు. తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్లు

మామిడికుదురు: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో సోమవారం ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షంతో రోడ్లు ముంపుబారిన పడ్డాయి. పలు గ్రామాల్లో ప్రధాన రోడ్లపై వర్షం నీరు నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మామిడికుదురులోని 216వ నంబర్ జాతీయ రహదారితో పాటు పలు గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లపై వర్షం నీరు నిలిచిపోయింది. అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి, మొగలికుదురు, గెద్దాడ, ఆదుర్రు, గోగన్నమఠం తదితర గ్రామాల్లో రోడ్లపై వర్షం నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు, రైతులు, ప్రజలు అవస్థలకు గురయ్యారు. ఆవర్తనం ప్రభావంతో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలు ప్రజల్ని ఆందోళనకు గురి చేస్తున్నాయి.

లింగ వివక్షను నిర్మూలిద్దాం



ఆలమూరులో లింగవివక్షపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: నేటి సమాజంలో లింగ వివక్షను పూర్తిగా నిర్మూలించి ఆడబిడ్డను రక్షించుకోవడం ద్వారా సృష్టిని కాపాడదామని ఎంఈఓలు భమిడిపాటి అప్పాజీ, ఎస్.రాజు అన్నారు. మండల కేంద్రమైన ఆలమూరు బొబ్బా జయశ్రీ బాలికోన్నత పాఠశాలలో లింగ వివక్షత నిర్మూలనపై అవగాహన సదస్సు జరిగింది. లింగ వివక్షత నిర్మూలన వారోత్సవాలను పురస్కరించుకని వైద్య ఆరోగ్య సిబ్బంది కె.శ్వేత, కె.సుజాత, జి.లోవకుమారి ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయిని కె.ఉమాదేవి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ఈ సదస్సును ఎంఈఓలు ప్రారంభించారు. అలాగే ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో లింగ వివక్ష వల్ల కలిగే అనర్థాలను, సృష్టిలో సంభవించే సమస్యలను విద్యార్థులకు వివరించారు. లింగ వివక్ష నిర్ధారణకు పాల్పడినా, ప్రోత్సహించినా ప్రభుత్వం తీవ్రమైన నేరంగా పరిగణించబడుతుందన్నారు.

జీవన ఎరువుల వాడకంపై అవగాహన

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లిలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విద్యాలయం, జిల్లా వ్యవసాయ సాంకేతిక సలహా (ఏరువాక) కేంద్రం, ప్రధాన శాస్త్రవేత్త, కోఆర్డినేటర్, డా. ఎం.నంద కిషోర్ ఆధ్వర్యంలో సోమవారం జీవన ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. జిల్లాలో ఏరువాక కేంద్రం సోమవారం నుంచి 17 వరకు ‘జీవన ఎరువుల అవగాహన వారోత్సవాలు’ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా అయినవిల్లి గ్రామ సచివాలయం వద్ద రైతులకు జీవన ఎరువుల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి గ్రామ సర్పంచ్ అధ్యక్షత వహించారు. నందకిషోర్ మాట్లాడుతూ రైతులకు జీవన ఎరువులు అంటే ఏమిటి, అవి ఎన్ని రకాలు, వాటిని ఎలా వృద్ధి చేసుకోవచ్చు, వాడేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు తెలియజేశారు.

అంబాజీపేట: పుల్లేటికుర్రులో సర్పంచ్ జల్లి బాలరాజు అధ్యక్షతన జీవన ఎరువుల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏరువాక శాస్త్రవేత్త నందకిషోర్ వీటిపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. జీవన ఎరువుల్లో బాక్టీరియా వాటిపై రైతులకు వివరించారు.